క్లుప్తంగా

కంప్యూటర్ ప్రింటర్ బహూకరణ



మదనాపురం: మండల పరిధిలోని దుప్పల్లి జెడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాల 1998 -99 బ్యాచ్ పూర్వ విద్యార్థులు పాఠశాలకు కంప్యూటర్ ప్రింటర్, ఫైర్‌సేఫ్టీ సిలిండర్‌ను పూర్వ విద్యార్థులు మహిపాల్ రెడ్డి, పురేందర్, ప్రవీణ్‌కుమార్, ప్రకాష్ చేతుల మీదుగా పాఠశాల హెచ్ఎం లక్ష్మీనారాయణ గుప్తాకు అందజేశారు. అనంతరం సీనియర్ ఉపాధ్యాయులు మూలె ఆంజనేయులు చేతుల మీదుగా మిత్ర బృందాన్ని పాఠశాల ఉపాధ్యాయులు శాలువా పూలమాలతో సన్మానించారు. ఉపాధ్యాయులు రాజు, తిరుపతయ్య, పాండు రంగ, శ్రీనివాసులు, నాగేష్, ఇషాక్ పాషా తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల పంపిణీ



మదనాపురం: వ్యవసాయ కూలీలకు కనీస వేతనాలు పెంచాలని, ఉపాధి కూలీల బకాయిల డబ్బులను వెంటనే ప్రభుత్వం చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శుక్రవారం కరపత్రాల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా నాయకులు వెంకట్రాములు మాట్లాడారు. ప్రధానంగా వ్యవసాయ కూలీలకు కనీస వేతనాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పత్తి, మిరప, మొక్కజొన్న, మామిడి, పొగాకు, చెరుకు, ఆముదం, కలుపు తీయడం రోజువారి కూలీ రూ.700, దున్నడం, మందు స్ప్రే చేయడం, తవ్వడానికి రూ.750, ఉల్లిగడ్డ, నువ్వులు, వేరుశనగ, జొన్నలు, పొద్దుతిరుగుడు, పెసర, విత్తనాలు వేయడం, కోసే కూలీలకు రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆ సంఘం జిల్లా నాయకులు రాజు గ్రామస్తులు పాల్గొన్నారు.

యూనిఫాంల అందజేత

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని ఎంఆర్సీ వద్ద శుక్రవారం రెండో విడత యూనిఫాంలను ఉపాధ్యాయులకు అందించారు. ఎంఈఓ ఉషారాణి అందుబాటులో లేకపోవడంతో ఆమె ఆదేశంతో కాంప్లెక్స్ హెచ్ఎం కాళిదాసు పంపిణీ చేశారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఇప్పటికే మొదటి విడత యూనిఫాం అందించామని క్లస్టర్ హెచ్ఎం తెలియజేశారు. రెండో విడత వచ్చిన దుస్తులను మండలంలోని పాఠశాలల హెచ్ఎంలకు విద్యార్థుల సంఖ్య ఆధారంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, కృష్ణవేణి, పవన్, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



కొత్తకోట రూరల్: మండల పరిధిలోని కానాయపల్లి గ్రామ శివారులోని దత్తకోటిలింగేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తరపున జిల్లా కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సతీష్ రూ.5 లక్షలు విరాళంగా అందజేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో వనపర్తి ఎమ్మెల్యేగా తూడి మెఘారెడ్డి గెలవాలని మొక్కుకున్నట్టు, ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలువడంతో మొక్కు తీర్చుకునేందుకు రూ.5 లక్షలు విరాళంగా అందజేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా సతీష్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు. చీర్ల చందర్, వెంకటేష్, మధుగౌడ్, రమేష్, మన్యంకొండ, రామకృష్ణ, ఆలయ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీలు శుభ్రం చేయించాలని వినతి

వీపనగండ్ల: గ్రామంలోని డ్రెయినేజీల్లో చెత్తాచెదారం పేరుకుపోవడంతో దుర్వాసన వస్తుందని, వెంటనే వాటిని తొలగించాలని గోవర్ధనగిరి గ్రామ సీపీఎం నాయకులు శుక్రవారం గ్రామకార్యదర్శికి వినతి అందజేశారు. గ్రామంలో నెలకొన్న సమస్యలపై వారు ఇంటింటికీ తిరుగుతూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో అర్హులైన వారికి రేషన్‌కార్డులు, పింఛన్లు, ఆరోగ్యశ్రీ కార్డులను వెంటనే అందజేయాలన్నారు. కరోనా సమయంలో తమ గ్రామానికి ఉన్న బస్సు వసతిని తొలగించారని ఇప్పటికీ రద్దు చేసిన బస్సును పునరుద్ధరించలేదన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి వర్గ సభ్యులు మహెబూబ్‌పాష, ఖాజా ఉస్సేన్, రవిప్రసాద్, శ్రీనివాసులు, కృష్ణయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

చెక్కు పంపిణీ

పెబ్బేరు రూరల్: మండల కేంద్రంలోని విజయ్ కుమార్ చారికి సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.60 వేల చెక్కును శుక్రవారం ప్రగతి భవన్ హైదరాబాద్‌లో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి బాధితుడికి అందజేశారు. వెంకట్రాములు యాదవ్, సుబ్బయ్య గుప్తా పాల్గొన్నారు.

కాల్వలు కబ్జా



కబ్జాకు గురైన డి-4 కాల్వలో దిగువకు నీళ్లు వెళ్లకపోవడంతో పొలంలో నిలిచిన నీరు

- మండలంలో పెరుగుతున్న ఆక్రమణలు
- జోరుగా నిర్మాణాలు
- పట్టించుకోని అధికారులు

చిన్నంబావి: భూముల ధరలకు రెక్కలు రావడంతో ఆక్రమణలు పెరిగిపోతున్నాయి. ఖాళీ స్థలం కనిపిస్తే అక్రమార్కులు రంగంలోకి దిగిపోతున్నారు. భారీ భవంతులు నిర్మించేస్తున్నారు. మండలంలో కాల్వలు సైతం కబ్జా చేసి నిర్మాణాలు సాగిస్తున్నారు. ఆక్రమణలను అడ్డుకోవాల్సిన అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం క్షేత్రస్థాయి సిబ్బంది తెరవెనుక ఒప్పందాలతో యథేచ్ఛగా కాల్వలు, ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయి.

రైతుల ఇక్కట్లు

గోపాల్‌దిన్నే రిజర్వాయర్ నుంచి చివరి ఆయకట్టు ప్రాంతం అయిన చిన్నంబావి మండలానికి కెనాల్ కాల్వ ద్వారా సాగునీటిని అందిస్తున్నారు. ఆ కెనాల్ కాల్వకు మండల కేంద్రంలో డి-4, డి-5 రెండు బ్రాంచ్ కెనాల్ కాల్వలు ఉన్నాయి. మండల కేంద్రంలో ఆ రెండు బ్రాంచ్ కెనాల్ కాల్వ కట్టలను కబ్జా



మండల కేంద్రంలో కబ్జాకు గురైన డి-4 కాల్వ

చేసి పెద్ద భవనాలను నిర్మించడంతో దిగువ రైతులకు సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదేవిధంగా బ్రాంచ్ కెనాల్‌కు దగ్గరలోని కాల్వ కరకట్టలను కబ్జా చేసి యథేచ్ఛగా షాపింగ్ కాంప్లెక్స్‌లను, ఇంటి నిర్మాణాలు చేపట్టడంతో దిగువకు వెళ్లే నీరు వెళ్లలేక పంటపొలాల్లోకి వస్తున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఫిర్యాదులన్నీ చెత్తకుప్పలకే..

నూతనంగా మండల కేంద్రం ఏర్పడటంతో భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. అనంతరం రియల్‌ఎస్టేట్ దందా జోరుగా సాగుతుండటంతో కొత మంది రియల్ బ్రోకర్లు రాజకీయ అండదండలతో యథేచ్ఛగా కాల్వలను ఆక్రమించుకుంటున్నారు. దీనిపై ఎన్నోసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా.. పట్టించుకోవడం లేదని పలువురు రైతులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్, స్థానిక మంత్రి జూపల్లి కృష్ణారావు పట్టించుకోవాలని కోరుతున్నారు.

నీరు నిలుస్తుంది..



మండల కేంద్రంలో నాకు నాలుగు ఎకరాల పొలం ఉంది. అందులో మొక్కజొన్న పంటను సాగు చేశాను. డి-4కాల్వ కట్ట కబ్జా చేసి అక్రమంగా ఇళ్లు, షాపింగ్ కాంప్లెక్స్‌లను నిర్మించడంతో నీరు దిగువ రైతులకు వెళ్లడంలేదు. మా పొలంలో వద్దనే మొత్తం నీరు నిలిచి పంట పాడవుతుంది. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలి.

– జుర్రు గంగయ్య

మంత్రి పట్టించుకోవాలి



మండల కేంద్రం నుంచి వచ్చే డి- 4, 5 కాల్వలు కబ్జా అయ్యాయి. మంత్రి జూపల్లి ఒక్క సారి సొంత మండలంపై సారిస్తే బాగుండు.

– జగ్గారి శ్రీధర్ రెడ్డి

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం..

నాలుగేళ్లుగా ఈ సమస్యపై ఫిర్యాదులు అందుతున్నాయి. గతంలో నాలుగుసార్లు కాల్వలను కబ్జా చేసిన వారికి నోటీసులు ఇచ్చాం. ఇదే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

– జగదీశ్, లైన్ ఇన్‌స్పెక్టర్

కరాటే విద్యార్థులకు బెల్టుల ప్రదానం

పెబ్బేరు రూరల్: పెబ్బేరు పట్టణంలోని సుమన్ కరాటే ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు బెల్ట్ టెస్టు నిర్వహించారు. కథన్, బేసిక్ విభాగంలో నైపుణ్యం చూపించి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కారుపాకుల వెంకట్రాములు సర్టిఫికెట్లు, బెల్టులు అందజేసి అభినందించారు. ఇన్‌స్ట్రక్టర్ భీశ్మనాథ్, ట్వింకిల్ రెడ్డి, పవన్‌కుమార్, శ్యాంకుమార్ పాల్గొన్నారు.

సీఎం, ఎమ్మెల్యేల చిత్రపటాలకు పాలాభిషేకం

గోపాల్‌పేట: రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేసినందుకు గాను శుక్రవారం రేవల్లి మండలంలోని కేశంపేటలో సీఎం రేవంత్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మేఘారెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు సురేష్‌గౌడ్, నాగయ్య, భీముడు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పట్టణ బంద్



అమరచింత: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను వ్యతిరేకిస్తూ.. శుక్రవారం హిందు వాహిణి ఆధ్వర్యంలో తలపెట్టిన బంద్ కార్యక్రమం ప్రశాంతంగా ముగిసింది. వ్యాపారులు, విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించడంతో సాయంత్రం వరకు దుకాణ సముదాయాలు మూసి తమ నిరసన వ్యక్తం చేశారు. క్యామ భాస్కర్, రాకేష్ శెట్టి, శ్రీనివాస్ యాదవ్, సిద్దు, విజయ్ పాల్గొన్నారు.

కోదండరాంకు సన్మానం

వనపర్తిటౌన్: కోదండరాంకు విద్యాశాఖ మంత్రి పదవి ఇవ్వాలని టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు ఖాదర్ పాషా, మహనీయుల స్ఫూర్తి వేదిక రాష్ట్ర కన్వీనర్ ప్రజావాగ్గేయకారుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్సీ కోదండరాం శాసన మండలి సభ్యుడిగా ప్రమాణ స్వీకారం అనంతరం హైదరాబాద్‌లో టీజేఎస్, జన సమితి నాయకులు బొకే అం

ప్రజలను సంఘటితం చేస్తాం

వీపనగండ్ల: ప్రజా సమస్యలు పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నారని, సమస్యల పరిష్కారం కోసం ప్రజలను సమీకరించి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు శ్రీరాం అన్నారు. శుక్రవారం బొల్లారంలో సీపీఐ గ్రామస్థాయి కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గోపల్‌దిన్నె రిజర్వాయర్ నింపేందుకు సింగోటం రిజర్వాయర్ నుంచి నూతనంగా నిర్మించనున్న లింక్ కెనాల్‌లో భూములను కోల్పోయే రైతులకు మార్కెట్ విలువకు అనుగుణంగా పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో అధికారులు విఫలం అవుతున్నారని, ఉన్నతాధికారులు స్పందించి గ్రామాల్లో విద్యా, వైద్యం, తాగునీటి వసతులు మెరుగు పరచకుంటే ప్రజలను సమీకరించి ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు చల్మారెడ్డి, వంక గోపాల్, కుర్మయ్య, వినోద్, స్వామి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



బొల్లారంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలి

పెబ్బేరు రూరల్: వనపర్తి పట్టణ పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు డిమాండ్ చేశారు. శుక్రవారం వనపర్తి సీపీఐ జిల్లా కార్యాలయంలో గోపాలకృష్ణ అధ్యక్షతన పట్టణ నిర్మాణ కౌన్సిల్ విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. 2008 భూపోరాటంలో పట్టణంలో అర్హులైన 685 మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చారని, ఇంత వరకు వారికి ఇల్లు నిర్మించ లేదన్నారు. వీరు కాకుండా చాలామంది అర్హులైన పేదలు ఉన్నారని, అందరికి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కళావతమ్మ, జయమ్మ, శిరీష పాల్గొన్నారు.



వనపర్తి సీపీఐ కార్యాలయంలో మాట్లాడుతున్న నాయకులు

కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకో..

కొత్తకోట రూరల్: మహిళలపై కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి కేటీఆర్‌కు సూచించారు. మహిళలపై అహంకారపూరితమైన వ్యాఖ్యలు చేశాడంటూ నిరసిస్తూ కొత్తకోట పట్టణ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో స్థానిక చౌరస్తాలో నిరసన తెలిపి కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. శ్రీనివాసులు, సలీంఖాన్, వెంకటేష్, రవీందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వనపర్తిటౌన్: కేటీఆర్ మహిళలను కించపరుస్తూ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా శుక్రవారం పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రాజీవ్ చౌక్‌లో కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశంలో మహిళలపై సంస్కారం, సభ్యత లేనివారే బీఆర్ఎస్‌లో ఉన్నారని, ఆ పార్టీలో పనిచేస్తున్న అధినాయకత్వం నుంచి కార్యకర్త వరకు స్త్రీలపై గౌరవం ఉండదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ కృష్ణ, సతీష్, వెంకటేష్, చీర్ల సత్యం, విభూతి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



అమరచింతలో పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, ప్రత్యేక అధికారి లక్ష్మప్ప

అమరచింత: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉంటామని, పరిసరాల పరిశుభ్రత కోసం మున్సిపల్‌కు ప్రజలు సహకరించాలని మున్సిపల్ ప్రత్యేక అధికారి, మత్స్యశాఖ ఏడీ లక్ష్మప్ప, చైర్‌పర్సన్ మంగమ్మ అన్నారు. ఫ్రై డే డ్రై డే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని పదో వార్డులోని కాలనీలో పర్యటించారు. ఏపుగా పెరుగుతున్న గడ్డి పొదలను తొలగించే పనులను మున్సిపల్ కార్మికులతో చేయించారు.

ఖిల్లాఘనపురం: వర్షాకాలంలో ప్రతి శుక్రవారం డ్రై డేను మండలంలోని ప్రతి గ్రామంలో కచ్చితంగా నిర్వహించాలని ఎంపీడీఓ వెంకటాచారి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటుగా మండలంలోని అన్ని గ్రామపంచాయతీల పరిధిలో డ్రై డే నిర్వహించారు. ఇంటింటకీ తిరిగి నిల్వనీటిని పారబోశారు. గ్రామాల్లోని డ్రెయినేజీల వెంట బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. పిచ్చిమొక్కలు తొలిగించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడారు. వర్షాకాలంలో రోడ్ల వెంట, ఇళ్ల వద్ద మురుగు నిలిచి ఉంటే దోమల సంతతి పెరుగుతుందన్నారు. ఈ దోమలతో మలేరియా లాంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. పంచాయతీ కార్యదర్శులతో పాటుగా ఎంపీడీఓ, ఎంపీఓ, వైద్య సిబ్బంది, ఆశాకార్యకర్తలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులపై అవగాహన అవసరం

వీపనగండ్ల: పారిశుద్ధ్య పనులపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉన్నప్పుడే గ్రామ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటాయని అంగన్‌వాడీ టీచర్లు, వైద్యసిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో డ్రై డే సందర్భంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. డ్రెయినేజీల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించడం, నిల్వ నీటిని పారవేయడం, దోమలు, ఈగల నివారణకు బ్లీచింగ్ పౌడర్ చల్లడం లాంటి అంశాలపై గ్రామప్రజలకు అవగాహన కల్పించారు.

పాన్‌గల్: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోనే రోగాలకు దూరంగా ఉండవచ్చునని పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. ఫ్రైడే డ్రై డేలో భాగంగా శుక్రవారం మండల కేంద్రం పాన్‌గల్, శాగాపూర్, తెల్లరాళ్లపల్లి గ్రామాల్లో ఆయన సిబ్బందితో కలిసి పలు కాలనీల్లో పర్యటించారు. మురుగు నీటి గుంతల్లో అబ్బేట్ ద్రావణాన్ని పిచికారీ చేయించారు.

జ్వర పీడిత సర్వే పరిశీలన..

ఆయా గ్రామాల్లో ఇంటింటి జ్వర పీడిత సర్వేను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనుమానితుల నుంచి రక్త నమూనాలను సేకరించాలని సిబ్బందికి సూచించారు. జన సమర్థ ప్రదేశాలకు వెళ్లవద్దని, సాధారణ జలుబు, జ్వరం, గొంతునొప్పి, శరీర నొప్పులు, కండ్ల కలక, శ్వాసకోశ ఇబ్బంది, న్యూమోనియా, క్షయ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. తాగునీటిని కాచి వడకట్టి తాగాలన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య, ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ తారంశాక్, సుమనశ్రీ, రాంచందర్ పాల్గొన్నారు.

దోమలు వ్యాప్తిచెందకుండా చర్యలు

ఆత్మకూర్: పరిసరాల పరిశుభ్రతతోనే అందరికి మేలు చేకూరుతుందని, దోమలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకుని రోగాలు తరిమేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రిరవికుమార్, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ నాగరాజు అన్నారు. శుక్రవారం ఫ్రై డే డ్రై డే సందర్భంగా 3వ వార్డులో కౌన్సిలర్ అశ్విన్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి ముమ్మరంగా పారుశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. దోమలు వ్యాప్తి చెందకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. కౌన్సిలర్లు, పురపాలిక సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

శుభ్రంగా ఉంచుకోవాలి

పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని పెద్దగుడెం గ్రామపంచాయతీ పరిధిలో ఫ్రై డే డ్రై డేలో భాగంగా శుక్రవారం ఎంపీడీఓ రాఘవే, వైద్య అధికారులతో కలిసి గ్రామాన్ని సందర్శించి, ఇంటింటికి తిరుగుతూ.. ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతం



ఆత్మకూర్‌లో వరలక్ష్మి వ్రతంలో పాల్గొన్న మహిళలు



అమరచింత వెంకటేశ్వర ఆలయంలో వరలక్ష్మి పూజల్లో పాల్గొన్న మహిళలు

వనపర్తిటౌన్: జిల్లా కేంద్రంలో శుక్రవారం వరలక్ష్మి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఆనందోత్సవాల మధ్య ఘనంగా నిర్వహించుకున్నారు. ప్రధాన ఆలయాలతో పాటుగా అత్యధికంగా మహిళలు తమ స్వగృహాల్లోనే అమ్మవారి ప్రతిమ ఏర్పాటు చేసుకొని వరలక్ష్మి వ్రతాన్ని శాస్త్రోక్తంగా ఆచరించారు. వెంకటేశ్వర స్వామి ఆలయంలో సామూహికంగా వరలక్ష్మి వ్రతాన్ని వేదపండితుడు గురుప్రసాద్ మహిళలతో జరిపించారు.

ఆత్మకూర్: శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా ఆత్మకూర్ శివారులోని శ్రీఅష్టలక్ష్మి సమేత శ్రీమన్నారాయణస్వామి ఆలయంలో భక్తిశ్రద్ధలతో సామూహిక వరలక్ష్మి వ్రతం నిర్వహించారు. ప్రముఖ వేదపండితుడు శ్రీమాన్ గొల్లూరి శేషాచార్యులు, అర్చకుడు సాకేత్‌చార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు వ్రతం నిర్వహించారు.

అమరచింత: శ్రావణమాసం సందర్భంగా శుక్రవారం వరలక్ష్మి వ్రత పూజలను మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఆలయ పూజారితో పాటు వేద పండితులు వరలక్ష్మి వ్రత మహత్యాన్ని వివరించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

సమయపాలన పాటించాలి

పాన్‌గల్: ఉపాధ్యాయులు సమయపాలన తప్పక పాటించాలని ఎంపీడీఓ గోవింద్‌రావు అన్నారు. శుక్రవారం మండలంలోని అన్నారంతండా ప్రాథమిక పాఠశాలను ఆయన ప్రార్థన సమయంలో సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రిజిష్టర్లను, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం నాణ్యతగా అందించేలా ప్రతినిత్యం హెచ్ఎంలు పర్యవేక్షణ చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం బిచ్యానాయక్, ఉపాధ్యాయులు చెన్నమ్మ, పంచాయతీ కార్యదర్శి బొజ్జినాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రార్థనలో పాల్గొన్న ఎంపీడీఓ గోవింద్‌రావు

పాము పట్టివేత

కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలోని వివేకానంద కాలనీలో సందశ్రీనివాసులు ఇంటి సమీపంలో రెండు రోజులుగా పాము సంచరిస్తుంది. శుక్రవారం సాయంత్రం స్నేక్ క్యాచర్ కృష్ణసాగర్‌కు ఫోన్ చేసి సమాచారం తెలియజేశారు. ఆయన అక్కడకు చేరుకుని గంటపాటు శ్రమించి పామును పట్టుకున్నాడు. పామును పట్టుకోవడంతో ఊపిరి పీల్చుకున్నామని స్థానికులు తెలియజేశారు. పాములను చంపవద్దని, కనిపిస్తే 9985545526 నంబర్‌కు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వవచ్చన్నారు.

దిష్టిబొమ్మ దహనం

పెబ్బేరు రూరల్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ మహిళలను కించ పరుస్తూ.. మాట్లాడి మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశాడని, ఆయన వైఖరిని నిరసిస్తూ.. కాంగ్రెస్ జిల్లా పార్టీ ఆధ్వర్యంలో శుభాష్ చౌరస్తాలో కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్‌యాదవ్, శ్రీనువాస్‌గౌడ్ పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన కాంగ్రెస్ నేతలు

కొత్తకోట రూరల్: రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కొత్తకోట కాంగ్రెస్ నాయకులు శుక్రవారం హైదరాబాద్‌లోని మంత్రి చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. మండల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కావాలని, మండలంలోని పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లగా.. సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాపయ్యగారి కృష్ణారెడ్డి, చర్లపల్లి మాజీ సర్పంచ్ శేఖర్‌రెడ్డి, బీచుపల్లి యాదవ్ ఉన్నారు.

దోమల నివారణకు మందుల పిచికారీ



అమరచింత: తరగతి గదులతో పాటు విశ్రాంతి గదుల్లో దోమలు రాకుండా నివారణ చర్యలు తీసుకుంటే విషజ్వరాలు రాకుండా కాపాడుకోవచ్చని సీహెచ్ఓ సురేష్ కుమార్ తెలియజేశారు. మండలంలోని కేజీబీవీ పాఠశాలలో శుక్రవారం దోమల నివారణకు మందులను తరగతి గదుల్లో పిచికారీ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్ఓ స్వప్నరాణి, కేశవులు, సురేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రధానికి ఘన నివాళి



వనపర్తిటౌన్: మాజీ ప్రధాన మంత్రి వాజ్‌పేయి సేవలు దేశ ప్రజలు ఎన్నటికీ మరువలేరని బీజేపీ పట్టణ అధ్యక్షుడు బచ్చు రాము అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో వాజ్‌పేయి వర్ధంతిని పట్టణ బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

డీ ఫార్మసిలో పాన్‌గల్ విద్యార్థి ప్రతిభ



పాన్‌గల్: మండల కేంద్రం పాన్‌గల్‌కు చెందిన అబ్దుల్ ఆసిఫ్ వనపర్తి పాలిటెక్నిక్ కళాశాలల్లో డి ఫార్మసిలో 85 శాతం పర్సంటేజ్‌తో కళాశాల టాపర్‌గా నిలిచి ప్రతిభ చాటాడు. కళాశాలల్లో 2023-24 సంవత్సరంలో ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో టాపర్‌గా నిలవడంతో గోల్డ్ మెడల్, రూ.5వేల నగదు ప్రోత్సాహకం, ప్రశంసా పత్రాన్ని కళాశాలలో నిర్వహించిన సమావేశంలో అధ్యాపకులు అందజేశారు.

కాలనీవాసుల హర్షం



వీపనగండ్ల: మండల కేంద్రంలోని రాజీవ్‌నగర్ కాలనీలోని చేతిపంపు కొన్ని నెలలుగా పని చేయకుండా ఉండటంతో మండల కేంద్రానికే చెందిన బీఆర్ఎస్ నాయకుడు ముంత మల్లయ్య యాదవ్ రూ.8 వేలు ఖర్చు చేసి చేతిపంపును మరమ్మతు చేయించాడు. సమస్యను అధికారులకు తెలియజేసినా.. పట్టించుకోలేదని స్థానికులు వాపోయారు. మల్లయ్య యాదవ్‌కు పలువురు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఉమ్రా యాత్రికుడికి సన్మానం

అమరచింత: పట్టణానికి చెందిన సయ్యద్ సిరాజ్ దంపతులు ఉమ్రా యాత్రకు వెళ్తున్న సందర్భంగా శుక్రవారం జామియా మసీదు కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. అదే విధంగా టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజ్ గౌడ్ ఆధ్వర్యంలో పట్టణ కాంగ్రెస్ నాయకులు శాలువా, పూల మాలతో సత్కరించారు. అయూబ్‌ఖాన్, అన్సారీ, ఖాజాహుస్సేన్, అఫు, పాల్గొన్నారు.